ప్రజాశక్తి
గురువారం 21 నవంబర్ 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

వరికపూడిసెలను ఎప్పుడు పూర్తి చేస్తారు ?

శాసన మండలిలో ప్రశ్నించిన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు



పల్నాడు జిల్లాలోని వరికపూడిసెల ఎత్తిపోతల సాగునీటి ప్రాజెక్ట్‌ను ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రిని ప్రశ్నించారు. ప్రాజెక్టుకు కేటాయించిన నిధులు తదితర వివరాలు అడిగారు. దీనికి మంత్రి రామానాయుడు సమాధానం ఇస్తూ కేంద్ర ప్రభుత్వం ఎంఒఇఎఫ్ అండ్ సిసి శాఖ వరికపూడిసెల ఎత్తిపోతల పథకానికి ప్రతిపాదించిన 19.13 హెక్టార్ల అటవీ భూమి మళ్లింపునకు (ఒకటవ దశ) ఆమోదం ఇచ్చిందన్నారు. వెల్దుర్తి మండలంలో 24,900 ఎకరాలకు సాగునీరు అందించటానికి 2019 ఫిబ్రవరిలో జిఓ 104 ద్వారా రూ.340.26 కోట్లకు ప్రభుత్వం పాలన అనుమతి ఇచ్చిందన్నారు. ఎంఇఎఫ్ నుండి తుది అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని మంత్రి చెప్పారు. లక్ష్మణరావు మాట్లాడుతూ వరికెపూడిసెల పల్నాడు ప్రజల చిరకాల స్వప్నమని, రెండో దశకు కూడా అనుమతిచ్చి దుర్గి, బొల్లాపల్లి, పుల్లలచెరువు మండలాలకు కూడా నీరు అందించాలని కోరారు. అందుకు ఈ బడ్జెట్‌లోనే నిధులు కేటాయించాలన్నారు.

పట్టభద్ర ఓటర్ల పరిశీలన పూర్తి

- 3.21 లక్షల దరఖాస్తు పరిశీలన, 11,775 పెండింగ్
- 23న డ్రాఫ్ట్ ఓటరు జాబితా

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఎన్నికలకు సంబంధించి బుధవారంతో ఓటరు దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యింది. బుధవారం రాత్రి 8 గంటల వరకూ అందిన సమాచార ప్రకారం 96.46 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశారు. అర్ధరాత్రి 12 గంటల వరకూ పరిశీలన కొనసాగుతుంది. దీంతో స్వల్పంగా పెరుగుదల ఉండే అవకాశం ఉంది. ఈ నెల 23న ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారులు జారీ చేస్తారు.

నియోజకవర్గంలోని ఆరు జిల్లాల పరిధిలో సెప్టెంబర్ 30 నుండి నవంబర్ 06 వరకు ఓటరు దరఖాస్తులు స్వీకరించారు. వాటిలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అందిన 3,32,786 దరఖాస్తులు పరిశీలనకు తీసుకోగా, 3,21,011 అప్లికేషన్ల పరిశీలన పూర్తయ్యింది. ఇంకా 11,775 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో అత్యధిక భాగం అడ్రస్‌లు దొరక్కపోవటంతో పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు గుంటూరు జిల్లాలోనే అధికంగా ఉన్నాయి. డ్రాఫ్ట్ జాబితా విడుదల చేసిన తర్వాత 23వ తేదీ నుండి డిసెంబర్ 9 వరకూ జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. డిసెంబర్ 25వ తేదీ నాటికి అభ్యంతరాల పరిశీలన పూర్తి చేసి, 30న తుది జాబితా విడుదల చేస్తారు. ఈ సమయంలోనే అభ్యంతరాలతో పాటు, గతంలో దరఖాస్తు చేసుకోలేని వారు డిసెంబర్ 9వ తేదీ వరకూ కొత్తగా దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం కల్పిస్తారు. కావున జాబితాలో నమోదు కాని వారు, కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు ఆందోళన చెందకుండా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని డిఆర్ఒ ఎన్.ఎస్కే ఖాజావలి తెలిపారు. కాగా కొన్నిచోట్ల క్షేత్రస్థాయి సిబ్బంది ఓటర్ల వివరాలు ఇంటింటికీ వెళ్లి పరిశీలించకుండానే చివరలో ఓట్లు ధ్రువీకరించారని సమాచారం. మంగళవారం నాటికి 80 శాతమే దరఖాస్తుల పరిశీలన పూర్తవగా చివరి ఒక్కరోజే దాదాపు 17 శాతం పరిశీలన పూర్తి చేశారు.

జిల్లా	అందినవి	పరిశీలన	పెండింగ్
బాపట్ల	23,925	23151	774
ఏలూరు	16,397	16386	11
గుంటూరు	1,021,81	93323	8858
కృష్ణా	61,215	61,171	44
ఎన్‌టిఆర్	70,287	69,641	646
పల్నాడు	58,781	57,339	1442



విద్యార్థినులతో మాట్లాడుతున్న పద్మావతి

250 మంది అమ్మాయిలకు ఒకే బాత్‌రూం

- హాస్టల్ పరిసరాల్లో పందులు, కుక్కల సంచారం
- నాసిరకం కూరగాయాలతో వంట
- విద్యార్థినుల దుస్థితిపై విస్తుపోయిన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు పద్మావతి
- రెండ్రోజుల్లో సమగ్ర నివేదికివ్వాలని అధికారులకు ఆదేశం

చదివింది చాల్లే ఇక పెళ్లి చేసుకో అనే ఒత్తిళ్లను ఎదిరించి కొందరు.. నిన్ను చదివించడానికి కావాల్సిన డబ్బు మనదగ్గర లేదమ్మా అనే ఆటంకాలను అధిగమించి కొందరు.. ఇలా ఏదో రకంగా కష్టనష్టాలను తట్టుకుంటూ అనేక మంది పేద విద్యార్థినులు చదువుతున్న హాస్టల్ కొత్త సమస్యల కూపంగా మారింది.. చదువుకుందామని పట్టుదలతో వచ్చిన అమ్మాయిలు బిగబట్టుకుని రోజులు గడపాల్సి వస్తోంది..

ప్రజాశక్తి-సత్తెనపల్లి

నియోజకవర్గ కేంద్రమైన సత్తెనపల్లిలోని ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిశీలిస్తే అక్కడ అంతమంది ఎలా చదవగలుగుతున్నారా? అనే అనుమానం.. ఆశ్చర్యమూ కలగక మానదు.. ఈ హాస్టల్లో 250 మంది ఉండగా ఒక్కటంటే ఒక్కటే మరుగుదొడ్డి, ఒకటే బాత్‌రూం ఉన్నాయి. సాధారణంగా విద్యార్థులందరూ ఒకే సమయంలో కాలేజీలకు వెళ్లాల్సి 2లో

పంట అలా ఉంటేనే మద్దతు ధర

- చివరి క్వింటాళ్ వరకూ కొనుగోలు చేస్తాం
- సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మార్కెటింగ్ డైరెక్టర్
- కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే తేమ శాతంలో సడలింపు ఇస్తామని రైతుల విన్నపానికి ప్రతిస్పందన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



పత్తి నాణ్యతను పరిశీలిస్తున్న మార్కెటింగ్ డైరెక్టర్ విజయ్ కురదగి

పల్నాడు జిల్లాలో ఏర్పాటు సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తిపంట చివరి క్వింటాళ్ వరకూ తప్పనిసరిగా కొనుగోలు చేస్తామని సిసిఐ మార్కెటింగ్ డైరెక్టర్ (ముంబయ్) విజయ్ కురడిగి అన్నారు. నాదెండ్ల మండలం గణపవరం జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని విజయ్ కురడిగి, సిసిఐ జనరల్ మేనేజర్ అమర్నాథ్‌రెడ్డి బుధవారం 2లో

పొన్నెకల్లు జెడ్పీ హైస్కూల్ పిఇటి సస్పెన్షన్

ప్రజాశక్తి-గుంటూరు

తాడికొండ మండలం, పొన్నెకల్లులోని డివికెఆర్ జెడ్పీ హైస్కూల్లో అక్టోబర్ 24న తేదీన 9వ తరగతి విద్యార్థి షేక్.సమీర్ నేలబావిలో పడి ప్రమాదవశాత్తూ మరణించిన ఘటనలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు వై.రాజారెడ్డిని సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు హాజరైన 9 మంది విద్యార్థులు చివరి పీరియడ్‌లో పాఠశాల వెనుకవైపు నుండి గోడ దూకి, పాఠశాలకు గైర్హాజరైన సమీర్‌తో కలిసి ఈతకు వెళ్లిన ఘటనలో పాఠశాల హెచ్ఎం, పిఇటి నిర్లక్ష్య వైఖరి కారణం అని గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి నివేదిక ప్రకారం రాజారెడ్డిని సస్పెండ్ చేశామన్నారు. హెచ్ఎం జరీనా ముంతాజ్‌బేగంపై చర్యలకు ఆర్‌జెడికి నివేదించినట్లు తెలిపారు.



8లో

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

రైతుసేవా కేంద్రాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మితే

48 గంటల్లో రైతుల ఖాతాలకు నగదు జమ

తూములూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్

చర్చించి పరిష్కరించండి

హెచ్ఆర్ కమిటీలో విద్యుత్ కార్మికుల సమస్యలపై మాట్లాడాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వినతి

2లో



గుర్తింపు కార్డులుంటే రుణాలు పొందండి

ప్రజాశక్తి - రెంటచింతల

గుర్తింపు కార్డులున్న కౌల్దార్లు పంట రుణాలు పొందాలని మాచర్ల ఎడిఎ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తుమ్మకోటలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎడిఎ మాట్లాడుతూ రబీ సీజన్ నుంచి రైతులుపంటల బీమా పథకం కోసం డిసెంబర్ 15లోగా ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులంతా తమ పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు. రూ.20 ప్రధానమంత్రి సురక్షకు, రూ.440 ప్రధానమంత్రి జీవనజ్యోతికి బ్యాంకులో చెల్లించి బీమాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో బ్రహ్మారెడ్డి, వీఏఏలు రాంబాబు నాయక్, శ్రీలత పాల్గొన్నారు.

పాఠశాల పనివేళల మార్పు సరికాదు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పాఠశాల పనివేళలు మార్చడం సరైంది కాదని ఎస్‌టియు పిఎ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్‌ఎం సుభాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలలు పని చేస్తున్నాయని, ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఈ సమయాలను ఉదయం 9 గంటల గంటలనుండి సాయంత్రం 5 గంటల వరకు మారుస్తామని ప్రభుత్వం చెప్పడం విడ్డూరమని పేర్కొన్నారు. 100 అక్షరాస్యత సాధించిన కేరళ రాష్ట్రంలో కూడా ఈ సమయాలు పాటించడం లేదని, ఈ ఆశాస్త్రీయ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. విద్యార్థుల మానసిక పరిస్థితి, సంసిద్ధత, అభ్యాసనం బోధనకు, సంభందించిన అంశాలతో సమయం ముడిపడి ఉంటుందని తెలిపారు.

పంట అలా ఉంటేనే మద్దతు ధర

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించారు. అమ్మకానికి వచ్చిన పత్తి నాణ్యతను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విజయవాడ రీజియన్ మార్కెటింగ్ శాఖ ఆర్.జె.డి.ఎం కాకుమాను శ్రీనివాసరావు, విజిలెన్స్ జెడి జి.రాజశేఖర్, సిసిఐ జనరల్ మేనేజర్ అమర్నాథ్ రెడ్డి, పల్నాడు జిల్లా ఎడిఎం కె.సూర్యప్రకాష్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ కార్యదర్శి యోగేశ్వరరావులతో కలిసి ప్రత్తి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. సిసిఐ నిబంధన మేరకే కొనుగోళ్లు జరుపుతామని 8-12 శాతం తేమ ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తామని అన్నారు. పత్తిలో నల్లకాయ ఉంటే అంతర్జాతీయ మార్కెట్లో భారత పత్తికి డిమాండ్ పడిపోతుందని, అందుకే రైతులు పత్తిని ఆరబెట్టిన నల్లకాయ లేకుండా తీసుకువస్తే గరిష్టంగా ప్రకటించిన మద్దతు ధర దక్కుతుందని అన్నారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. పత్తిని ఆరబెట్టుకునేందుకు ఇళ్ల వద్ద వెసులుబాటు ఉండదని, నిల్వ చేసే సౌకర్యాలు ఉండవని తేమ శాతం ఎక్కువగా ఉన్నా ధర తగ్గించే పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని కోరారు. ప్రస్తుతం పత్తి తీత ముమ్మరంగా ఉన్నందున కూలీలు ధరలు పెరిగాయని కూలీలు దొరక సమస్యలు ఎదుర్కొంటున్నామని వివరించారు. స్పందించిన సిసిఐ అధికారులు తేమ శాతం 15 వరకు ఉన్నా కొనుగోలు చేసేలా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామని, కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే కొనుగోలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సిసిఐ బయ్యర్ బి.రమేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.



చర్చించి పరిష్కరించండి

హెచ్‌ఆర్ కమిటీలో విద్యుత్ కార్మికుల సమస్యలపై మాట్లాడాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, పీస్‌రేట్ కార్మికులైన బిల్లు కలెక్షన్ ఏజెంట్లు, స్టోర్ హమాలీలు ఇతర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను శుక్రవారం జరగనున్న రాష్ట్ర హెచ్‌ఆర్ కమిటీ సమావేశంలో చర్చించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు కోరారు. ఈ మేరకు సూపరింటెండింగ్ ఇంజినీర్ గుంటూరు ఆపరేషన్ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఎఇ రామిరెడ్డికి బుధవారం వినపత్రం అందజేశారు.



ఎస్ఎఇకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.పవన్, జి.నాగరాజు మాట్లాడుతూ ఏళ్ల తరబడి విద్యుత్ రంగంలో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగభద్రత కరువైందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఉన్నా అమలు కావట్లేదన్నారు. 2022 పిఆర్‌సి బకాయిలు తక్షణమే ఇవ్వాలని, 2019 తర్వాత చేరిన షిఫ్ట్ ఆపరేటర్లందరికి పాత ఆపరేటర్ల మాదిరిగా వేతనాలు ఇవ్వాలని కోరారు. పీస్‌రేట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మీటర్ రీడర్లు, బిల్లు కలెక్షన్ ఏజెంట్లకు స్మార్ట్ మీటర్లు తీసుకొస్తున్న నేపథ్యంలో ఉద్యోగ భద్రత కరువుతుందని, వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలి కోరారు. తమ సమస్యను హెచ్‌ఆర్ కమిటీలో చర్చించి సానుకూలంగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విల్సన్, నాగరాజు, అయ్యప్ప నాగరాజు, లాజర్, వై.వి.యస్.స్వామి పాల్గొన్నారు.

250 మంది అమ్మాయిలకు ఒకే బాత్‌రూం

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుంది కాబట్టి ప్రతి 10-15 మందికి ఒక బాత్‌రూం, మరుగుదొడ్డి ఉండడం సౌకర్యంగా ఉంటుంది. అయితే ఈ హాస్టల్లో అది ఊహకు అందని సంఖ్యలా ఉంది. ఒకే బాత్‌రూం, మరుగుదొడ్డి ఉండడంతో విద్యార్థినులు కాలకృత్యాలు తీర్చుకోవడమే కష్టమవుతోంది. నిద్ర లేచించి మొదలు బిగబట్టుకుని కాలేజీలకు వెళ్లిన తర్వాత అక్కడ కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దారుణ దుస్థితి నెలకొంది. ఇదే విషయాన్ని మంగళవారం రాత్రి హాస్టల్‌ను సందర్శించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి ఎదుట విద్యార్థినులు వివరించారు.

సత్తెనపల్లి పట్టణంలోని వెంకటపతి నగర్‌లోని ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌లో పాడై, వాసనొస్తున్న అన్నం పెట్టారని హాస్టల్ వార్డెన్‌ను విద్యార్థినులు ప్రశ్నించగా వారిపై వార్డెన్ ఆగ్రహానికి గురవడంతో ఆ మాటలకు మనస్థాపానికి గురై ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హాస్టల్‌ను పద్మావతి మంగళవారం ఆకస్మికంగా సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఆమెకు విద్యార్థినులు వివరించారు. 250 మందికి గాను ఒకే బాత్‌రూం ఉందని, మిగతావి సెప్టిక్ ట్యాంకులు నిండి నిరుపయోగంగా ఉన్నాయని చెప్పారు. చాలా మంది విద్యార్థినులు కాలేజీలకు వెళ్లి కాలకృత్యాలు తీర్చుకోవాల్సి వస్తోందన్నారు. ఒకే బాత్రూం ఉన్న కారణంగా రెండ్రోజులకోసారి స్నానం చేస్తున్నామని వాపోయారు. అనంతరం పద్మావతి మాట్లాడుతూ రికార్డులు సరిగా లేకపోవడం, మెనూ చార్టును సైతం ప్రదర్శించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. హాస్టల్ పరిసరాల్లో పందులు, కుక్కలు సంచరిస్తున్నాయని, నాసిరకం కూరగాయలతోనే వంట చేస్తున్నారని, సమస్యలను చెప్పుకునే వీలుకూడా విద్యార్థినులకు ఇవ్వడం లేదని చెప్పారు. విద్యార్థులతో ఫుడ్ కమిటీ, మానిటరింగ్ కమిటీ, ప్రహరీ క్లబ్స్ కమిటీ, శానిటైజేషన్ కమిటీ, ప్రొటెక్షన్ కమిటీ లేకపోవడం, సాంఘిక సంక్షేమ శాఖాధికార్ల పర్యవేక్షణ లేమితో ఇక్కడివారి ఇష్టారాజ్యమైపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గుంటూరు జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులతో వీడియోకాల్ ద్వారా మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్రభుత్వ హాస్టళ్లలో నెలకోసారి ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు కోసం అధికారులను ఆదేశించారు. ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం ఘటనను సుమోటోగా తీసుకుని బాలల హక్కుల కమిషన్ విచారణ చేస్తుందని చెప్పగా మరికొన్ని విషయాలను రాతపూర్వకంగా ఇస్తామని విద్యార్థినులు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ సిఐ సత్యనారాయణ, ఎస్ఐ సంధ్యారాణి, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.బుల్లిబాబు, బాలల పరిరక్షణ కౌన్సిలర్ శ్రీనివాసరావు, ఎఎస్‌డబ్ల్యూ నిరీక్షణ కుమారి, సిడిపిఒ శ్రీలత సూపర్వైజర్ పాల్గొన్నారు.



హాస్టల్లో భోజనాన్ని పరిశీలిస్తున్న పద్మావతి

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

వారం రోజులుగా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఇప్పటి వరకూ నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి యంగ్‌మాన్ క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షులు చుక్క విన్సెంట్‌పాల్ అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యార్థులను పఠనాశక్తులుగా తయారు చేయడమే గ్రంథాలయ వారోత్సవాల ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ, సాహితీ వేత్తలు డాక్టర్ పీవీ సుబ్బారావు, డి.బుజ్జిబాబు, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జి.సరోజినీ, ఎన్.జయలక్ష్మి, గార్డ్స్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధి డి.చిట్టిబాబు, షేక్ లాలూ దాదా సాహెబ్ సేవా సమితి అధ్యక్షులు షేక్ సిద్ధాంతి కరిముల్లా, వైఎంసియే స్థానిక అధ్యక్షులు కె.రామ్మోహన్‌రావు బి.సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రతి విద్యార్థి పుస్తక పఠనం అలవర్చుకోవాలని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు అన్నారు. నరసరావుపేట పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ డి.యోగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఆర్.కె సతీష్ బాబు, లైబ్రేరియన్ అండ్ ప్రోగ్రామింగ్ కన్వీనర్ కె.ఎల్.ఎం ప్రసాద్, వై.శ్రీకాంత్, జి.మల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

వారం రోజుల నుండి విద్యార్థులకు జరిగిన వివిధ పోటీలలో విజేతలకు మంచికంటి వెంకటేశ్వరరావు ద్వారా బహుమతులను అందజేశారు.

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రం ఈపూరు శాఖ గ్రంథాలయంలో కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పి చెంచయ్య, జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు ఎన్ రామకృష్ణారెడ్డి హాజరై పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు. ఎ.ముప్పాళ్ళ శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం సాంబ నాయక్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీను నాయక్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇన్చార్జి గ్రంథాలయ అధికారులు గంటా శ్రీనివాసరావు, ఎస్ నాగలక్ష్మి, టిడిపి నాయకులు అయినాల కోటేశ్వరరావు, గోపువారిపాలెం సర్పంచ్ గోనుగుంట్ల శ్రీనివాసరావు, ఆర్ మురళి, బి సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

గంథాలయ వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని శ్రీకాసుబ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి కుమారి మాట్లాడుతూ విజ్ఞానాన్ని, మేధస్సును పెంపొందించేందుకు పుస్తకాలు దోహదపడతాయని, విద్యార్థులు ఎక్కువుగా పుస్తక పఠనం చేయాలని, ఎక్కువ సమయం గ్రంథాలయంలో గడపాలని అన్నారు. గ్రంథాలయములను ఉపయోగించుకొని దేశ ప్రగతిని ఏ విధంగా విజయవంతంగా ముందుకు నడిపించవచ్చు అనే అంశం గురించి డాక్టర్ బి శ్రీనివాస్ విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్, పాటలు ముగ్గుల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు ఎస్.చిన్న చెన్నయ్య పాల్గొన్నారు.



యడ్లపాడు గ్రంథాలయంలో బహుమతులు పొందిన విద్యార్థులతో గ్రంథాలయాధికారి అంజమ్మ, ప్రజానాట్య మండలి నాయకులు ఎన్.కాళిదాసు తదితరులు

ప్రజాశక్తి - యడ్లపాడు

స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సభ గ్రంథాలయ అధికారి సిహెచ్.అంజమ్మ అధ్యక్షతన జరిగింది. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఎన్.కాళిదాసు, కె.సామ్రాజ్యం, సంజీవరావు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇద్దరు బెల్ట్‌షాపు నిర్వాహకుల బైండోవర్

ప్రజాశక్తి-ఈపూరు

బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న ఈపూరు స్టేషన్ పరిధిలోని రొంపిచర్ల గ్రామానికి చెందిన రామిరెడ్డి, కృష్ణారెడ్డిని రొంపిచర్ల తహసిల్దార్ ముందు హాజరు పరిచి బుధవారం బైండోవర్ చేశామని ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ డి వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతు బెల్ట్ షాపు నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హచ్చరించారు. ఇప్పటివరకు బెల్ట్ షాపు నిర్వాహకులపై 11 కేసులు నమోదు చేసి వారిలో ఏడుగురు వ్యక్తులను బైండోవర్ చేయడం జరిగిందన్నారు. మద్యం లైసెన్స్ దారులు ఎంఆర్‌పి ధరలకే మద్యం విక్రయించాలన్నారు. నాన్ డ్యూటీ పేయిడ్ మద్యం, నాటు సారాయి పై సమాచారం ఉంటే స్థానిక ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

చిరు వ్యాపారాలపై కొరడా

నిబంధనలకనుగుణంగా క్రయవిక్రయాలు : కమిషనర్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అధికమవుతున్న పట్టణ జనాభా దృష్ట్యా తెనాలి ప్రాంత అభివృద్ధితో పాటు పట్టణంలో పలుచోట్ల రోడ్లు విస్తరణ పనులు చేపట్టినట్లు తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. రద్దీ ప్రాంతాలైన తెనాలి రత్న టాకీస్, శివాజీ చౌక్, బోస్ రోడ్డు ప్రాంతాల్లో రోడ్లు విస్తరణ పనులను విస్తృతంగా చేపట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో పట్టణ అభివృద్ధి, ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. తెనాలి అభివృద్దే లక్ష్యంగా కంకణం కట్టుకున్న రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆశయాలకు అనుగుణంగా మున్సిపల్ ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తుందన్నారు. ఇరుకు రోడ్లతో అవస్థలు పడుతున్న ప్రజలకు సౌకర్యంగా ఉండేలా రోడ్డు విస్తరణ పనులు చేపట్టామన్నారు. మార్కెట్ ప్రాంతంలో ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రభుత్వ షరతులకు అనుగుణంగా వ్యాపారం నిర్వహించుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు. నిబంధనలను వ్యతిరేకించిన వారిపై చర్యలు తప్పవన్నారు. మున్సిపల్ నియమ, నిబంధనలకు కట్టుబడి క్రయ, విక్రయాలు జరుపుకోవాలని వ్యాపారస్తులకు తెలియజేసారు. మార్కెట్లో రోడ్లకు అడ్డంగా క్రయ, విక్రయాలు నిర్వహిస్తున్న వ్యాపారులపై కొరడా ఝులిపిస్తామన్నారు. రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తున్న చిరువ్యాపారులను ఖాళీ చేయించారు. ఈక్రమంలో తరాలతరబడి చ ఇరువ్యాపారాలు నిర్వహించుకుంటున్నామని, ఇప్పటికిప్పుడు వెళ్లిపోమంటే ఎక్కడికి పోతామని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చిరు వ్యాపారులను ఖాళీ చేయించడంతో ఖాళీగా ఉన్న రోడ్డు

బాలికను వేధించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-తాడేపల్లి : మంగళగిరి రూరల్ మండలం పెదవడ్లపూడికి చెందిన నాంచారయ్య, తాడేపల్లి పట్నంలోని డోలాస్ నగర్ కు చెందిన ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. తల్లిదండ్రులు రాగానే బాలిక జరిగిన విషయాన్ని చెప్పింది. బాధితులు తాడేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నాంచారి పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ బత్తుల కళ్యాణ రాజుతెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి : గుంటూరు చుట్టుగుంట-పేరేచర్ల రహదారి పై పెట్రోల్ బంకు ఎదురు బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు సంపత్‌నగర్‌కు చెందిన చెక్కా రామకృష్ణ ద్విచక్రవాహనంపై వస్తున్న క్రమంలో వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో రామకృష్ణ (52) అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భౌతికకాయాన్ని జిజిహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

13 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - పెదకూరపాడు : అక్రమముగా నిల్వ ఉంచిన 13 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకొని అమరావతి మండలం ధరణికోటకి చెందిన కామేశ్వరరావును అరెస్టు చేశామని పెదకూరపాడు ఎక్సైజ్ సిఐ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం బాటిళ్లు నిల్వ ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిఐ వెంట ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

లలిత హాస్పిటల్‌లో ఉచిత పైల్స్ క్యాంప్

ప్రజాశక్తి-గుంటూరు : ప్రపంచ పైల్స్(మొలలు) దినం సందర్భంగా బుధవారం గుంటూరు లలిత హాస్పిటల్‌లో సీనియర్ సర్జన్ డాక్టర్ ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఉచిత పైల్స్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ తక్కువ నొప్పితో సులభమైన, ఆధునిక వైద్య పరికరాలు ఉపయోగించి చికిత్స అందిస్తున్నామన్నారు. ఇందుకోసం లలితా హాస్పిటల్‌లో గత కొన్ని సంవత్సరాలుగా మినిమల్ యాక్సిస్ (లాపరోస్కోపి), లేజర్ సహాయంతో ఆపరేషన్ చేస్తున్నామన్నారు. ఎండోస్కోపిక్ థైరాయిడిక్టమీ, లాపరోస్కోపి ద్వారా పలు అరుదైన అపరేషన్లు చేస్తున్నామన్నారు. పైల్స్ వ్యాధి అంటే చాలా మంది భయం, సిగ్గు కారణంగా తీవ్రత ఎక్కువయ్యేంత వరకూ బయట పడరని, అలాంటి వాటికి ఫిజర్, ఫిస్టులా, పైలో నైడల్ సైనస్ మొదలగు సమస్యలకు కూడా లేజర్ ఉపయోగించి, తక్కువ ఖర్చుతో సులభంగా నొప్పి లేకుండా చేయవచ్చన్నారు. కిడ్నీలో రాళ్లు ఉన్న వారికి లేజర్ ద్వారా చికిత్స, స్త్రీల గర్భాశయంలో ఏర్పడే పెద్ద గడ్డలను సైతం నీడిల్ హోల్ సర్జరీ ద్వారా కరిగించ వచ్చన్నారు. వివిధ రక్త నాళాలలో ఏర్పడే రక్తపు గడ్డల వల్ల రక్త సరఫరా తగ్గిన వారికి పిన్‌హోల్ సర్జరీల ద్వారా ఆధునిక పద్దతలో సర్జరీలు చేస్తున్నామని డాక్టర్ తెలిపారు.

పురుగు మందు తాగి పాస్టర్ ఆత్మహత్య

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్



సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో పురుగుమందు తాగి చర్చి పాస్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు. మేడికొండూరు మండలం పాకాలపాడుకు చెందిన చర్చి పాస్టర్ అబ్రహం ఉరఫ్ ఒంటిపూలి కాటిస్వామి (40) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పాస్టర్ అబ్రహాంకు అతని భార్యకు కొంతకాలంగా వివాదం జరుగుతుంది. భార్య తేనంకమ్మ భీమవరంలో తల్లిదండ్రులు వద్ద ఉంటుంది. ఇటీవల పెద్ద మనుషుల సమక్షంలో భార్యకు నెలకు 5వేలు ఇచ్చేందుకు పాస్టర్ అబ్రహం ఒప్పుకున్నాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో తేనంకమ్మ రూరల్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పాస్టర్ ను పోలీసులు పిలిపించారు. పెద్ద మనుషుల రంగంలోకి దిగి ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చేందుకూ ప్రయత్నించారు. ఈ క్రమంలో పాస్టర్‌ను వారు మందలించారు .మనస్తాపం చెందిన పాస్టర్ అబ్రహం పురుగు మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. అతడిని సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడు తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి పట్టణ సిఐ బ్రహ్మయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్ర గాయాలైన సంఘటన సత్తెనపల్లి మండలం నందిగామ రోడ్డు పెట్రోల్ బంకు సమీపంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం పెదకూరపాడు మండలం 75 తాళ్లూరు గ్రామానికి చెందిన చెరుకూరి శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరి భార్యాభర్తలు. వీరు సత్తెనపల్లి నుండి పనులు చూసుకొని బుధవారం సాయంత్రం తమ స్వగ్రామం బైక్ పై బయలుదేరారు. నందిగామ రోడ్డు లోని పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డు మరమ్మతు కోసం రోడ్డుపై బేబీస్ డస్ట్ కుప్ప పోసి ఉన్నది. ఆర్ అండ్ బి అధికారులు ఈ కుప్ప వద్ద ప్రమాద హెచ్చరికను తెలియజేస్తూ బార్కెట్‌ను కూడా పెట్టకపోవడంతో వారు చీకట్లో గమనించక బైక్‌ను ఆ కుప్ప పైకి ఎక్కించారు. అదుపుతప్పి కుప్ప పైనుండి పడి క్రిందికి జారి పడటంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. 108 ద్వారా వారిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడికి గాయాలు

ప్రజాశక్తి - అచ్చంపేట : మద్యం తాగిన వ్యక్తి కారు బైకును ఢీకొనడంతో బైకుపైన ఉన్న తల్లి, కుమారుడికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెరుకుపల్లికి చెందిన ఎం సన్నీ అనే విద్యార్థి, అతని తల్లి భవాని అచ్చంపేట వైపు నుండి ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. దోసపాడు చెరువు సమీపంలో అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో బైక్ హ్యాండిల్ విరిగిపోయి తల్లి కొడుకు పడిపోవడంతో గాయాలయ్యాయి. 108ద్వారా స్థానికులు క్షతగాత్రలను వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



25 నుండి 108 ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - రెంటచింతల

ఏ ప్రమాదం జరిగిన ముందు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తూ రేయింబవళ్లు పని చేసే తమకు వేతనాలు సరిగా అందడం లేదని 108 ఉద్యోగులు వాపోతున్నారు. ఇంక్రిమెంట్లు, గ్రాట్యూటీ తదితర సదుపాయాలు అందడం లేదంటున్నారు. ఈ అంశాలపై వారు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పి.పాపారావు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న తమను ప్రభుత్వంలో విలీనం చేయాలని, 108 వాహనాలను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని కోరారు. పైలట్, ఇఎంటి (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్)లను వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులుగా గుర్తించాలని, ఐదో తేదీ లోపు జీతాలు చెల్లించాలని కోరారు. ఈ అంశాలపై ఈనెల 25 నుంచి సమ్మెలో పాల్గొంటున్నట్లు ప్రకటించారు. ఎస్.శరత్, ఎస్.కె బాషా పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సిఐడి డీఎస్పీ గోలి లక్ష్మయ్య

అట్రాసిటీ చట్టంపై సిఐడి అవగాహన

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

వివక్షత, వేధింపుల నుండి రక్షణ పొందేందుకే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని రూపొందించినట్లు సిఐడి డీఎస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు. సత్తెనపల్లి మండలంలోని లక్కరాజు గార్లపాడులో సిఐడి ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు లక్ష్మయ్య మాట్లాడుతూ అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేసుకోకుండా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హక్కులకు భంగం వాటిల్లినా, దాడులు జరిగినా చట్టాన్ని ఎలా ఉపయోగించుకోవాలో? నష్టపరిహారం ఎలా పొందాలో వివరించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గీ నరసింహారావు, సిఐడి సిఐ కె.విక్టర్, రూరల్ ఎస్సై అమీరుద్దీన్, సర్పంచ్ జె.మరియమ్మ, దళిత సంఘాల నాయకులు పి.రాజు, ఎం.చిన్నప్ప పాల్గొన్నారు.

హోం గార్డుల కుటుంబాల్లో కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నిరంతరం ప్రజారక్షణకై పాటుపడే పోలీస్ సిబ్బందికి అండగా ఉంటామని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. అనారోగ్య కారణాల వల్ల మరణించిన హోంగార్డు కుటుంబాల్లోని వారిని కారుణ్య నిమామకాల కింద హోంగార్డులుగా



నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. నరసరావుపేట ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ, ఫిబ్రవరిలో అనారోగ్యంతో మరణించిన సిహెచ్. మల్లికార్జునరావు కుమార్తె నాగేశ్వరీకు హోంగార్డు ఉద్యోగం ఇచ్చారు. ఏపీఎస్పీ 8వ బెటాలియన్ మంగళగిరిలో పనిచేస్తూ గత ఏప్రిల్‌లో మరణించిన పి.శరత్‌బాబు భార్య జాశ్నిని హోంగార్డుగా నియమించారు.

వేధింపులు, తొలగింపులపై విఒఎల ధర్నా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ప్రతిపక్షంలో ఉండగా ఒక తీరుగా.. అధికారం దక్కాక మరో తీరుగా కూటమి పార్టీల నాయకుల తీరుందని సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి విమర్శించారు. స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులపై రాజకీయ వేధింపులకు పాల్పడబోమని ప్రభుత్వంలో ఉన్నతస్థాయి వారు చెబుతుండగా కింది స్థాయిలో మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా ఉందని మండిపడ్డారు. యానిమేటర్ల (విఒఎ)పై రాజకీయ వేధింపులకు నిరసనగా వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా హనుమంతరెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న విఒఎల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని కోరారు. పెదకూరపాడు నియోజకవర్గంలో అన్ని మండలాల్లో రాజకీయ వేధింపుల నేపథ్యంలో విఒఎలు తొలగింపునకు గురయ్యారని, కోర్టుకెళ్లిని వీరికి అనుకూలంగా హైకోర్టు ఉత్తర్వులిచ్చినా పీడీ, ఏపిఎంలు వాటిని అమలు చేయడం లేదని అన్నారు. విఒఎలను విధుల్లోకి తీసుకోపోవడం ద్వారా కోర్టు ఉత్తర్వులనూ ధిక్కరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళ మార్టుల్లో సరుకుల బలవంతపు కొనుగోళ్లు ఆపాలన్నారు. అనంతరం జిల్లా రెవిన్యూ అధికారి మురళికి వినతిపత్రం అందజేశారు. విఒఎలు సి.హెచ్.వి.రమణ, బి.భాగ్యలక్ష్మి, కె.మేరీ, రోహిణి పాల్గొన్నారు.



ప్రజా సమస్యలపై మరిన్ని పోరాటాలు, ఉద్యమాలు

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

సిపిఎం సత్తెనపల్లి మండల కార్యదర్శిగా పెండ్యాల మహేష్ ఎన్నికయ్యారు. మండలంలోని కందులవారి పాలెంలో జరిగిన ఆ పార్టీ మండల మహాసభ బుధవారం ముగిసింది. మండల వ్యాప్తంగా ఉన్నా శాఖల నుండి వచ్చిన ప్రతినిధులు వివిధ అంశాలు, ప్రజల సమస్యపై విస్తృతంగా చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు, పోరాటాలను మరింతగా చేపట్టాలని, సరళీకరణ ఆర్థిక విధానాలకు, మతోన్మాదానికీ వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాలని ప్రతినబూనారు. మహాసభ ముగింపులో నతూన కార్యదర్శి మాట్లాడుతూ సత్తెనపల్లిలో కమ్యూనిస్టు ఉద్యమానికి ఘనమైన చరిత్ర ఉందని, ఉద్యమం కోసం సర్వస్వాన్ని అర్పించిన యోధులు మండలంలో ఉన్నారని అన్నారు. వారి పోరాటాల స్ఫూర్తితో శక్తివంచన లేకుండా నూతన కమిటీ కృషి చేస్తుందని ఉద్ఘాటించారు. మహేష్ తోపాటు 10 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. వీరిలో ఎం.నరసింహారావు, సిహెచ్ లక్ష్మీనారాయణ, దుగ్గి మేరమ్మ, జె.భగత్, బి.రామారావు, వి,తులసిరాం, ఆర్.పూర్ణచంద్రరావు, బి.శివయ్య, మరో ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు. మహసభలకు ఆతిథ్యమిచ్చిన కందులవారిపాలెం గ్రామ కమిటీకి ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. అంతర్జాతీయ గీతాలాపన, అమరవీరులకు జోహార్లతో మహాసభను ముగించారు.

తండ్రీకొడుకుల మధ్య ఎస్పీ సయోధ్య

ప్రజాశక్తి-యడ్లపాడు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించి పల్నాడు జిల్లా ఎస్.పి కె.శ్రీనివాసరావు స్వయంగా క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. ఈ నెల 18న స్పందనలో మండల కేంద్రమైన యడ్లపాడుకు చెందిన ఎడ్లూరి నాగరాజుపై తండ్రి వెంకట్రావు ఫిర్యాదు చేశారు. ఆస్తిని కాజేసేందుకు ఉన్న ఆస్తిని తన పేరిట రాసి ఇంటి నుండి వెళ్లిపోవాలని గొడవ పడుతూ దూషిస్తూ దాడికి పాల్పడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొంటూ ఎస్పీని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఎస్పి కె.శ్రీనివాసరావు యడ్లపాడుకు వచ్చారు. తండ్రీకొడుకుల మధ్య పదేళ్ల నుండి గొడవలు జరుగుతుండగా 2022లో సీనియర్ సిటిజన్ యాక్ట్ కింద యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో కుమారుడు నాగరాజుపై తండ్రి వెంకట్రావు ఫిర్యాదు చేశారు. అయినా నాగరాజు ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఎస్పికి ఫిర్యాదు చేశారు. ఇరువురితో ఎస్పీ మాట్లాడారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పట్ల ప్రేమ, మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. తండ్రి సంరక్షణ బాధ్యత తీసుకుంటానని నాగరాజు ఎస్పీ, గ్రామపెద్దల సమక్షంలో అంగీకరించారు. వివాదాన్ని మళ్లీ రాజేసుకుంటే కేసులు నమోదు చేస్తామని ఎస్పీ చెప్పారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ సంతోష్, ఎస్‌బి సిఐ సురేష్‌బాబు, గ్రీవెన్స్ సిఐ సుభాషిని, రూరల్ సీఐ బి సుబ్బానాయుడు, ఎస్సై వి.బాలకృష్ణ ఉన్నారు.





వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టొద్దు


- కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కోసం 26న కలెక్టరేట్ వద్ద ధర్నా
- జయప్రదానికి రౌండ్ టేబుల్ సమావేశం పిలుపు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

రైతు సమస్యల పరిష్కారం కోసం సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈ నెల 26న నర్సారావుపేటలోని కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. మండల కేంద్రమైన ముప్పాళ్లలో బుధవారం నిర్వహించిన సమావేవంలో రైతుసంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ, సీనియర్ నాయకులు గద్దె చలమయ్య మాట్లాడుతూ గతంలో ఢిల్లీ పోరాటం సందర్భంగా మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి దొడ్డిదారిన నల్ల చట్టాల అమలుకు పూనుకుందని విమర్శించారు. పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని, వ్యవసాయ బోర్లకు మోటార్లు పెట్టే ప్రక్రియ అపాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ కింద ఇస్తానన్న రూ.20 వేలను రైతుల, కౌలురైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. పత్తి పంటను ప్రైవేటు మిల్లుల్లో కాకుండా మార్కెట్ యార్డుల్లో సిసిఐ ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. కార్మికుల హక్కులను హరించేలా కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, గతంలో ఉన్న కార్మిక చట్టాలనే పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేసి చౌక దుకాణాల అందించాలన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు టి.అమరలింగేశ్వరరావు, జి.జాలయ్య, ఎం.వెంకటరెడ్డి, కె.సాంబశివరావు, టి.వెంకటేశ్వర్లు, డి.అప్పారావు, పి.సైదాఖాన్, కె.నాగేశ్వరరావు, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కలెక్టరేట్ వద్ద 26న నిర్వహించే ధర్నా, మహాసప్రదర్శన జయప్రదం కోసం మండల కేంద్రమైన రొంపిచర్లలో ఎఐకెయస్, ఎఐటియుసి, సిపిఐ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఎఐకెయస్ జిల్లా కార్యదర్శి యు.రాము, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కె.రాంబాబు మాట్లాడారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతీవరప్రసాద్, ఏరియా కార్యదర్శి సి.సత్యనారాయణరాజు, మండల కార్యదర్శి ఆర్.అంజిరెడ్డి పాల్గొన్నారు.



ముప్పాళ్లలో సమావేశం



రొంపిచర్లలో ప్రచారం



గుంటూరులో మాట్లాడుతున్న కంచుమాటి అజయ్



తుళ్లూరు సమావేశంలో మాట్లాడుతున్న వై నేతాజీ

26న గుంటూరులో కార్మిక, రైతు ప్రదర్శన,సభ

ప్రజాశక్తి-గుంటూరు

అఖిల భారత కార్మిక, రైతు సంఘాల పిలుపులో భాగంగా ఈనెల 26న రాజ్యాంగ పరిరక్షణ దినం పేరుతో గుంటూరులో కార్మిక, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగే ర్యాలీ, బహిరంగ సభ జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం పిలుపునిచ్చింది. బుధవారం బ్రాడీపేటలోని సంఘం కార్యాలయంలో జొన్న శివశంకర్ అధ్యక్షతన జరిగిన ఆఫీసు బేరర్స్ సమావేశంలో జిల్లా కార్యదర్శి కంచు మాటి అజయ్ మాట్లాడుతూ గుంటూరులోని శంకర్ విలాస్ సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ, అనంతరం సభ జరగనున్నదని తెలిపారు. నూతన వ్యవసాయ చట్టాలను చారిత్రాత్మక పోరాటంతో వెనక్కి కొట్టినా కేంద్రం దొడ్డి దారిన వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించటానికి ప్రయత్నాలు చేస్తూనే ఉందన్నారు. కార్మిక చట్టాలు నిర్వీర్యం చేసి, నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. జిల్లాలో పత్తిరైతులు, ధాన్యం రైతులు మద్దతు ధర లేక అల్లాడి పోతున్నారని, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధరలస్థిరీకరణ నిధితో మార్కెట్ యార్డు, సొసైటీ లద్వారా పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాటా ్లడుతూ కేంద్రం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే పద్ధతిలో సబ్సిడీలు ఎత్తివేస్తుందని, ఫలితంగా రైతులకు పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని, రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారని అన్నారు. అనేక అప్పుల బాధలు తాళలేక ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సబ్సిడీలు అందడంలేదన్నారు. సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యం అన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు వల్లూరు భారతి, ఆఫీస్ బేరర్స్ తమ్మ ప్రసాద్‌రెడ్డి, మార్పుల వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు : 26న గుంటూరులోని శంకర్ విలాస్ సెంటర్ నుండి జరిగే రైతు కార్మికుల ర్యాలీ, సభను జయప్రదం చేయాలని సిఐటియు గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ పిలుపునిచ్చారు. బుధవారం సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ సమావేశం తుళ్లూరులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఎం రవి అధ్యక్షతన సమావేశంలో ని నేతాజీ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తుందని, వాటిని వెంటనే ఆపాలని విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ 26వేలు ఇవ్వాలని, రైతులు పండించిన పంటకు పెట్టుబడికి 50శాతం కలిపి గిట్టుబాటు ధర ఇవ్వాలని, స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం అమలు చేయాలని కోరారు. సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు మాట్లాడుతూ, రాజధాని నిర్మాణంలో స్థానిక కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, రాజధాని పరిధిలో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు రాజధాని సామాజి పెన్షన్ అమలు చేయాలని, విట్, ఎస్ ఆర్ ఎమ్, అమృత యూనివర్సిటీలో పనిచేస్తున్న కార్మికులకు కార్మిక చట్టాలు అమలయ్యే విధంగా చూడాలని అన్నారు. 26న గుంటూ రులో జరిగే రైతు, కార్మిక ర్యాలీకి రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాశక్తి మంగళగిరి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన జిల్లా కేంద్రాల్లో జరిగే మహాధర్మాలను జయప్రదం చేయాలని కోరుతూ రైతు కూలి సంఘం, ఏఐఎఫ్టీయూ న్యూ ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరి పట్టణంలో వివిధ ప్రాంతాలలో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఐఎఫ్టియు నాయకులు కే కోటేశ్వరావు, కే ఆదినారాయణ, రైతు కూలీ సంఘం నాయకులు డి భాస్కరరావు, ఎం అంజిరెడ్డి, దుర్గాప్రసాద్, లక్ష్మి, ప్రసాద్ పాల్గొన్నారు.

వట్టిచెరుకూరు మండలంలో కలెక్టర్ పర్యటన

అభివృద్ధి పనులు, జెడ్పీ హైస్కూల్లో తనిఖీ

ప్రజాశకి-గుంటూరు



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

వట్టిచెరుకూరు మండలంలోని కోవెలమూడిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, ముట్లూరులో నిర్మాణంలో వున్న క్యాటల్‌షెడ్ (పశువుల పాక) నిర్మాణ పనులు, ఆనంతవరప్పాడులో డ్రైన్, సీసీ రోడ్ల నిర్మాణ పనులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ గుంటూరు ఆర్డీఓ కె.శ్రీనివాసరావుతో కలసి ఆకస్మిక తనిఖీ చేశారు. కోవెలమూడి అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల హాజరు, వారికి అందిస్తున్న ఆహారం, శిక్షణ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అర్ధమయ్యే రీతిలో బోధించాలని అంగన్‌వాడీ టీచర్ నవనీతంకు కలెక్టర్ సూచించారు. చిన్న పిల్లలకు ఐక్యూ పెరిగే విధంగా వస్తువుల పేర్లను, రంగులను వారు బాగా గుర్తుకు తెచ్చుకునే విధంగా సున్నితంగా బోధించాలని సూచించారు. తర్వాత ముట్లూరులో నిర్మాణంలో వున్న క్యాటెల్‌షెడ్‌ను కలెక్టర్ పరిశీలించి లబ్దిదారు పి.సుధాకర్‌తో మాట్లాడారు. తనకు వున్న ఆరు పశువులకు రూ.2.30 లక్షల అంచనా వ్యయంతో షెడ్ కట్టుకోవడానికి ప్రభుత్వం మంజూరు చేసినట్లు లబ్దిదారు వివరించారు. గ్రామంలో మంజూరైన మూడు షెడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారుల్ని ఆదేశించారు. పల్లెపండుగ కార్యక్రమం క్రింద ఆనంతవరప్పాడుకు మంజూరైన డ్రైన్లు, సిసి రోడ్ల పనులను పరిశీలించారు. తర్వాత ఆనంతవరప్పాడు జెడ్పీ హైస్కూల్‌ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. గతేడాది ఈ పాఠశాలలో 372 మంది విద్యార్థులు హాజరు కాగా, ఈ ఏడాది 302 మంది విద్యార్థుల సంఖ్యకు ఎందుకు తగ్గిందని పాఠశాల హెచ్ఎం అరుణకుమారిని కలెక్టర్ ప్రశ్నించారు. విద్యార్థుల హాజరు సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని తింటున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. స్కూల్‌లో అందిస్తున్న మధ్యాహ్న భోజనం ఎలా వుందని, కోడిగుడ్లు, చిక్కీలు అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనాన్ని కలెక్టర్ రుచి చూసి భోజనం నాణ్యతను పెంచాలని, అలాగే మరికొంత ఎక్కువగా కూరలు కూడా విద్యార్థులకు అందించాలని సూచించారు. పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని పరిశీలించి నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ, డ్వామా పీడీలు విజయలక్ష్మీ, శంకర్, డిఇఓ రేణుక, యంపీడీఓ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ ఉద్యోగులు ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం స్థానిక ఎన్‌టిఆర్ బస్టాండ్‌లో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి యం.హరిప్రసాద్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి టి.వి.జి.రవిశంకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ఆర్టీసి విలీన సమస్యలు పరిష్కారం చేయలేదని, ఈ ప్రభుత్వమైనా పరిష్కరించాలని కోరారు. 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, సిబ్బందిపై వత్తిడి లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సి, లీవు ఎన్‌క్యాష్‌మెంట్లు, అలవెన్సులు, ఎస్‌బిటి బకాయిలు చెల్లించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, విద్యుత్ బస్సులు ఆర్టీసీకే ఇవ్వాలని, ప్రమోషన్లకు అనుమతి ఇవ్వాలని, పాత పింఛను, పాత వైద్యవిధానం అమలు చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం ఇతర జివోలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కొరకు ఆర్టీసీ ఉద్యోగులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ధర్నాలో జిల్లా సహాయ కార్యదర్శి రామకష్ణ, మధు, వెంకటరెడ్డి, శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


అసెంబ్లీ దృష్టికి ఖాళీస్థలాల యజమానుల నిర్లక్ష్యం

మురుగునీరు నిలిచిన ప్రదేశాల చిత్రాలను చూపి మాట్లాడిన ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఇళ్ళ మధ్య ఉన్న ఖాళీ స్థలాల వలన జరిగే ఇబ్బందులను శాసన సభా సాక్షిగా మున్సిపల్ శాఖ మంత్రి దృష్టికి తీసుకొని వచ్చారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఈ ఖాళిస్థలాల విషయాన్నీ ప్రస్తావించారు. పశ్చిమ నియోజకవర్గంలో ప్రతి డివిజన్ లో సుమారు 10 నుండి 15 ఖాళీ స్థలాలు ఉంటాయని, ప్రధానంగా 21, 25, 28, 29, 36, 39, 43 డివిజన్ లలో అధికంగా ఉంటున్నాయని, వీటి స్థల యజమానుల నిర్లక్ష్యం వలన స్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి, చెత్త, విష సర్పాలు మరియు మురుగు నీరు నిలబడి ఉంటున్నాయని పేర్కొంటూ నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ఉన్న సమస్యల చిత్రాలను అసెంబ్లీలో ఎమ్మెల్యే గళ్లా మాధవి చూపించారు. ఈ ఖాళీ స్థలాల యజమానుల నిర్లక్ష్యం వలన అటు ప్రజలకు అనారోగ్యంతో పాటు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నదని, వర్షాకాలంలో ఇవి చెరువులను కూడా తలపిస్తూ, రోజుల తరబడి నీళ్ళు నిలబడి ఉంటున్నాయని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. కాబటి ఈ సమస్య మీద మునిసిపల్ శాఖ మంత్రి దృష్టిపెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్థల యజమానులు పై చర్యలు తీసుకుని, అధికారులకు ఆదేశాలు జారి చేసి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు.



డిఆర్‌డిఎ పీడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

యానిమేటర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

యానిమేటర్లకు ఐదు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని, మూడు సంవత్సరాల కాలపరిమితి జీవో రద్దు చేయాలని కోరుతూ యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం పీడీ విజయలక్ష్మికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యానిమేటర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, తొలగించిన యానిమేటర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సహజ న్యాయ సూత్రాలను తుంగలో తొక్కి మూడు సంవత్సరాలకే యానిమేటర్లు ఉద్యోగం వదిలి వెళ్లాలని చెప్పడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల అణచివేత ధోరణి విడనాడాలని కోరారు. అక్రమంగా తొలగించిన యానిమేటర్లు తమ ఉద్యోగం తిరిగి నిలబెట్టుకోవడానికి కోర్టుకెళ్లి ఆర్డర్ తెచ్చుకున్నప్పటికీ జిల్లాస్థాయి అధికారులు కూడా కోర్టు ఆర్డర్లను అమలు చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యానిమేటర్లు తమ విధులు నిర్వహించడానికి అవసరమైన సెల్‌ఫోను, 5జి నెట్‌వర్క్‌ను రాష్ట్ర ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కె.పద్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, శారద పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో మహిళా సాధికారతపై అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

గోరంట్లలోని సెయింట్ ఆన్స మహిళా కాలేజిలో మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. స్త్రీలకు పురుషులతో పాటు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించటం, బాలికలు ఎదుర్కొనే సమస్యలు, బాలికా రక్షణ చర్యలు, దురాగతాలను ఎదుర్కొంటున్న స్త్రీలకు, బాలికలకు సరైన న్యాయం కల్పించాలని, స్త్రీ విద్యప్రాధాన్యత తదతర అంశాలపై ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ సభ్యులు ప్లకార్డులతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెవరెండ్ సి.సంధ్య, వైస్ ప్రిన్సిపాల్ షారోన్‌రోజ్, మహిళా సాధికారత కమిటీ కన్వీనర్ రమణ తదితరులు పాల్గొన్నారు.



శాంతమూర్తిని అభినందిస్తున్న కేరళ సిఎం విజయన్

వయనాడ్ బాధితులకు 'అవర్ స్టేట్ అవర్ లీడర్' విరాళం

ప్రజాశక్తి-గుంటూరు

కేరళ వాయనాడ్ బాధితులకు రూ.75 వేలు డిడిని అవర్ స్టేట్ అవర్ లీడర్ అధ్యక్షుడు జి.శాంతమూర్తి కేరళ ముఖ్యమంత్రి పినరయు విజయన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ శాంతమూర్తిని అభినందించారు. కేరళ బాధితులకు తెలుగువారు తమ వంతు సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారని సిఎం విజయన్ అన్నారు. ఈ సందర్భంగా శాంతమూర్తి మాట్లాడుతూ వాయనాడ్‌లో వర్షాలకు కొండ చర్యలు విరిగిపడి వరదల్లో చిక్కుకున్న బాధితుల కష్టాలు చూసి తెలుగు వారు చెలించి పోయారన్నారు. సాయం చేయడంలో తెలుగువారు ఎప్పటికీ ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా నుండి జయప్రకాష్‌బాబు, పధ్వీరాజ్‌రెడ్డి పాల్గొన్నారు.



పాఠశాలకు క్రీడా సామగ్రి వితరణ

ప్రజాశక్తి - పెదకూరపాడు

స్థానిక జెడ్పి పాఠశాలకు క్రీడా వస్తువులు, టేబుల్ టెన్నిస్ బోర్డును ప్రముఖ విద్యావేత్త మురళి ముకుంద్ అందించారు. రానున్న రోజుల్లో లైబ్రరీని కూడా ఏర్పాటు చేస్తామని, 8, 9 ,10 తరగతులకు డిజిటల్ కంటెంట్‌తో అధునాతన రీతిలో విద్యార్థులకు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భ:గా స్పోర్ట్స్ రూమ్‌ను ప్రారంభించారు. ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎం.రాధాకృష్ణ, లక్ష్మణరావు, శ్రీధర్, ఆర్.సాంబశివరావు, బి.మర్రిరెడ్డి, నరేష్, రాంబాబు పాల్గొన్నారు.

కోటప్పకొండ తిరుణాళ్లకు ప్రత్యేక ప్రణాళికలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే కోటప్పకొండ తిరుణాళ్ల ఏర్పాట్లపై ఇప్పటి నుండే ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కార్తీక సోమవారం, కార్తీక పౌర్ణమికి సంబంధించి ఏర్పాటు చేసిన బందోబస్తు వల్ల ఇప్పటి వరకు ఎలాంటి అసౌకర్యమూ రాకుండా చూశామన్నారు. శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి మహా స్వామీ నరసరావుపేట పట్టణానికి వస్తున్న కారణంగా బందోబస్తు ఏర్పాటు చేసి స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. నరసరావుపేట పట్టణంలో గంజాయి విక్రేతలపై అనేక కేసులు నమోదు చేశామని, పాలు, నూనె కల్తీల మీద నిఘా పెట్టామని చెప్పారు. తమ కృషికి ప్రజల సహకారం కూడా కావాలన్నారు. గంజాయి, కల్తీ వ్యవహారాల మీద సమాచారం తెలిస్తే పోలీసుకు చెప్పాలన్నారు. సమావేశంలో సిఐలు ఎం. విజయ్ చరణ్, ఎం.హైమారావు, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

దుర్గి మిర్చియార్డులో పంట కొనుగోలుకు కృషి

ప్రజాశక్తి-దుర్గి

ధర్మవరంలోని శ్రీ హరిహర బాలనాగేంద్ర స్వామి 34వ వార్షిక మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎండ్ల బండలాగుడు పోటీలు రెండోరోజుకు చేరాయి. బుధవారం పోటీలను మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు ప్రారంభించి మాట్లాడారు. దుర్గి మిర్చి యార్డులో పంటను కొనుగోలుకు కృషి చేస్తామన్నారు. ధర్మవరం మధ్యలోనే ఆగిపోయిన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేసి పొలాలకు నీరందిస్తామన్నారు. కార్యక్రమంలో పి.హరి, ఎన్.ప్రసాద్, టి.శ్రీనివాసరావు, ఎస్.యలమంద, డి.ప్రసాద్ పాల్గొన్నారు.

రేపటి వరకు ఆధార్ క్యాంప్

ప్రజాశక్తి- మాచర్ల

పట్టణంలోని 10వ వార్డు శెరిన్ కాలనీ సచివాలయంలో బుధవారం ఆధార్ క్యాంప్ జరిగింది. వార్డు ఎడ్యుకేషనల్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ కె.రాజు ఆధ్వర్యంలో ఆధార్ అప్డేట్ కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం వరకు క్యాంప్ కొనసాగుతుందని, ఆధార్‌లో మార్పులు చేర్పులతోపాటు 5 నుంచి 7 , 7నుంచి 15 ఏళ్ల వారికి ఉచితంగా వేలిముద్రలు అప్డేట్ చేస్తామని కె.రాజు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ అరుణ, సిబ్బంది వెంకటరామయ్య, బాబు పాల్గొన్నారు.



ఫిబ్రవరి నాటికి 46 వేల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో మంజూరైన 94,512 కుళాయి కనెక్షన్లకుగానూ ఫిబ్రవరి 2025 నాటికి 46,316 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు అందించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో బుధవారం సమీక్షించారు. రానున్న వేసవిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రూ.3.87 కోట్ల ప్రణాళికను ఆమోదించారు. ఈ మొత్తాన్ని బోరు బావుల పునరుద్ధరణ, పశువుల రక్షణ వంటి కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. అనంతరం 'టాయిలెట్ ఫర్ డిగ్నిటీ' పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా డిసెంబరు 10 మానవహక్కుల దినోత్సవం వరకూ పరిశుభ్ర శౌచాలయాల ఆవశ్యకత తెలియజేస్తూ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో విశిష్ట సేవలు అందించిన నలుగురు క్లాప్ మిత్రలకు సన్మానం చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ విజయకుమార్, భూగర్భ జలాధికారి శ్రీనివాసరావు, సిపిఒ శ్రీనివాస్ మూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి వెంకటరెడ్డి, డిపిఒ విజయ భాస్కర్‌రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ పిడి బాలు నాయక్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి పాల్గొన్నారు.

బహిరంగ మల,మూత్ర విసర్జనకు జరిమానా

ప్రజాశక్తి- మాచర్ల

మాచర్ల పురపాలక సంఘ పరిధిలో ఎవరైన బహిరంగ మల,మూత్ర విసర్జనకు పాల్పడితే రూ.500 జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ వేణుబాబు బుధవారం తెలిపారు. పట్టణాన్ని బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత పట్టణంగా ప్రకటిస్తామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు పురపాలక సంఘంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, పొదుపు మహిళా స్వయం సహాయక సభ్యుల వార్డు సభ్యుల నుండి బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత పట్టణంగా ధ్రువీకరించి తీర్మానించామని తెలిపారు. తీర్మానంపై ప్రజలు ఎమైనా సలహాలు ఇవ్వచ్చనని, అభ్యంతరాలుంటే 15 రోజులలోపు పురపాలక సంఘ కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు.



క్రోసూరు మండలం దొడ్లేరులో ప్రదర్శన

ప్రజాశక్తి - క్రోసూరు

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాల సందర్భంగా మండలంలోని దొడ్లేరులో బుధవారం ప్రదర్శన చేశారు. ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.శాంసన్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా తగినంత పారిశుధ్యం లేకపోవటం వల్ల బిలియన్ల మంది ఎదుర్కొంటున్న సవాళ్లను వెలుగులోకి తేవడానికి ప్రపంచ టాయిలెట్ దినోత్సవం దోహద పడుతుందని అన్నారు. సురక్షితమైన మరియు అందుబాటులో ఉండే టాయిలెట్ సౌకర్యాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పటానికి 2013 నుండి ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం ఆరోగ్య కార్యకర్త అనుపమ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ధనరేఖ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పూర్తికి చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - వినుకొండ



ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఎన్టీఆర్ నగర్ టిడ్కో ఇళ్ల పురోగతిని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ బుధవారం పరిశీలించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన యొక్క అఫర్డబుల్ హౌసింగ్ పార్ట్నర్‌షిప్ విభాగం పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యాల ద్వారా సరసమైన గృహాల నిర్మాణంపై దృష్టి పెడుతుందని తెలిపారు. దీని అమలుకు టిడ్కో బాధ్యత వహిస్తుందని చెప్పారు. పట్టణంలో టిడ్కో గృహాలు రెండు కేటగిరీల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. 300 చదరపు అడుగుల కేటగిరీలో 864 ఇళ్లు, 430 చదరపు కేటగిరీలో 576 ఇళ్లు మొత్తంగా 1440 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. 300 చదరపు అడుగుల కేటగిరికి సంబంధించి 864 ఇళ్లను రివర్స్ టెండరింగ్ ద్వారా ఐజెయం-ఇంద్రజిత్ మెహతా కన్స్ట్రక్షన్ కంపెనీ ద్వారా 720 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నట్లు చెప్పారు. 430 చదరపు అడుగుల కేటగిరీలో 576 ఇళ్లకుగాను 60 ఇళ్లు నిర్మాణం పూర్తి కావొస్తున్నాయని అన్నారు. మిగతా నిర్మాణాల పూర్తికి కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేస్తామని కమిషనర్ చెప్పారు.



విత్తన దుకాణంలో తనిఖీలు

ప్రజాశక్తి - నకరికల్లు

మండల కేంద్రమైన నకరికల్లులోని ఎన్.చిన్నయ్య అండ్ సన్స్ వరి విత్తనాల దుకాణంలో మండల వ్యవసాయ శాఖాధికారి దేవదాసు బుధవారం తనిఖీలు చేపట్టారు. వరి విత్తన నిలువల నుండి 3 రకాల నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. విత్తన క్రయవిక్రయాల్లో దుకాణాదార్లు, రైతులు పాటించాల్సిన నిబంధనలు, జాగ్రత్తలను చెప్పారు.



30 మంది 'ఈశ్వర్' విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రఖ్యాత క్యూ స్పైడర్ కంపెనీ తమ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 30 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ మేరకు విద్యార్థుల అభినందన సభలో కళాశాల ఛైర్మన్ షేక్ మీరావలి, సెక్రటరీ - కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఉద్యోగాల్లో చేరతారని చెప్పారు. శిక్షణా కాలంలో వార్షిక వేతనం రూ.5.20 లక్షలు కంపెనీ చెల్లిస్తుందన్నారు. అనుభవం కలిగిన అధ్యాపకులు అత్యాధునిక నాణ్యతా ప్రమాణాలతో సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ పట్ల ఇస్తున్న శిక్షణ నేపథ్యంలో తమ విద్యార్థులు బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికవుతున్నారని అన్నారు. గతేడాది 95 శాతం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించామని, ఈ ఏడాది 100 శాతం కల్పనే లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ షేక్.ముజీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - యడ్లపాడు : మండలంలోని తిమ్మాపురం, దింతెనపాడులో పొలం పిలుస్తోంది నిర్వహించారు. రైతు శిక్షణ కేంద్రం డిడిడి శివకుమారి, నరసరావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి సిహెచ్ సరిత తదితరులు పొలాలను సందర్శించారు. కంది, శనగ పైర్లలో తెగుళ్ల నివారణ, ఎరువుల వినియోగంపై రైతులకు పలు సూచనలు చేశారు. పంటలను బీమా చేయించుకోవాలన్నారు.

అడిగొప్పుల ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - దుర్గి

మండలంలోని అడిగొప్పులలో ఉన్న శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపును దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుధవారం చేపట్టారు. రూ.23,87,102 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వాణాధికారి, అసిస్టెంట్ కమిషనర్ సైదమ్మ బాయి తెలిపారు. 63 రోజుల పాటు సందర్శకులు ఇచ్చిన కానుకలను ఆలయ ముఖమండపంలో పర్యవేక్షణాధికారిగా పేటసన్నిగండ్ల గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి శివనాగిరెడ్డి పర్యవేక్షణలో లెక్కించారు.

వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

మాచర్ల జాగృతి మహిళా సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం దుర్గి మండలంలోని ఆత్మకూరులోగల కాశీనాయన వద్ధాశ్రమంలో నూతన వస్త్రాలు పంపిణి చేశారు. అనంతరం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని 25 మంది వృద్ధులకు ప్రత్యేకమైన విందు ఏర్పాటు చేశారు. సభ్యులు కె.కృష్ణకుమారి, ఝాన్సి, ఎన్.సురేఖ, టి.రాధ, ఎ.లక్ష్మీ, కె.అరుణ పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తేనే బిల్లుల చెల్లింపు

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో చేపట్టే అభివృద్ధి పనులు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను నేరుగా పరిశీలించిన తర్వాతే బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ నల్లకుంట, రామిరెడ్డి నగర్, రవీంద్ర నగర్, శ్యామలనగర్, పట్టాభిపురం, రత్నగిరి నగర్, జన్మభూమి నగర్ తదితర ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి రోడ్లు, డ్రైన్లను ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేసే రోడ్లకు తప్పనిసరిగా డ్రైన్ల నిర్మాణం కూడా చేపట్టాలని, డ్రైన్ టు డ్రైన్ ఉండేలా ప్రతిపాదనలు ఉండాలన్నారు. నల్లకుంట 8వ లైన్, శ్యామల నగర్ జీరోలైన్లలో నూతన కల్వర్ట్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రామిరెడ్డి నగర్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్ల మీదకు ర్యాంప్‌లు ఉండడం, భవన నిర్మాణ వ్యర్థాలు రోడ్ల పక్కన ఉండడంపై స్థానికుల ఫిర్యాదు మేరకు స్థానిక 94 వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి ఎస్.కె.అస్మాకి షోకాజ్ నోటీసు ఇవ్వాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అనంతరం బందావన్ గార్డెన్స్ లోని అన్నమయ్య వాకింగ్ ట్రాక్‌ని పరిశీలించి, ట్రాక్ అభివద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కమిషనర్‌ని శాలువాతో సత్కరించారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డిఈఈలు మధుసూదన్, రమేష్ బాబు, శ్రీనివాస్, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


అన్నమయ్య వాకింగ్ ట్రాక్‌ను సందర్శించిన కమిషనర్


అవగాహన కల్పిస్తున్న చైల్డ్ హెల్ప్ లైన్ సభ్యులు

బాల్యవివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి మండలం కొలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బాలల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 9, 10 విద్యార్థులకు బాలల హక్కులు, బాల్య వివాహాలు కారణంగా జరిగే నష్టాలపై వక్తలు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు టోల్ ఫ్రీ నెంబర్ 1098 సంప్రదించాలన్నారు. అన్ని సచి వాలయాల పరిధిలోని మహిళా పోలీసులు, పంచాయతీ సెక్రటరీలు, ఎఎన్ఎంలు, ఐసిడిఎస్ సిబ్బంది బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాలపై తల్లిదండ్రులకు అవ గాహన కల్పించాలన్నారు. బాలికను వివాహం చేసుకుని సంసారం చేసిన భర్తకు ఫోక్స్ చట్టం క్రింద పది సంవ త్సరాలు జైలుశిక్ష పడుతుందన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ హిమబిందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బాలనాగయ్య నాయక్, రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ సభ్యులు లక్ష్మణ్, కొలకలూరు సచివాలయ-1 సిబ్బంది ఎం మల్లిక, మహిళా పోలీసు జి ప్రగతి, రజని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ బి రమేష్

మత్తు వదిలితేనే భవిష్యత్తు

ప్రజాశక్తి-తాడేపల్లి

యువత మత్తు వదిలితేనే భవిష్యత్తు ఉద్యోగంగా ఉంటుందని మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ బి రమేష్ తెలిపారు. బుధవారం తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్ నగర్, శ్రీరామ్ మెట్రిక్యులేషన్ పాఠశాలలో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా వక్తృవ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నవంబర్ 20వ తేదీ ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం గా జరుపు కుంటున్నట్లు తెలిపారు. బాలల హక్కుల గురించి అవ గాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పరస్పరం బాలలు తమ మనోభావాలు పంచుకోటానికి సమాలోచన చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. బాలల అక్రమ రవాణా, లైంగిక వేధింపు లు, మాదక ద్రవ్యాలు, తదితర సంఘటనలు భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తున్నాయని వివరించారు. 1989లో బాలల హక్కులపై చట్టబద్ధమైన అంతర్జాతీయ ఒప్పందం జరిగినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మాదకద్రవేయుల వినియోగం, ఆరోగ్యంపైప్రభావం అనే అంశం మీద వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బి అఖిల్, డి హర్షిక దేవి, డి జయంత్, వరుసగా ప్రథమ, ద్వితీయ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు ఎస్ షారోన్, ఉపాధ్యాయుల సమంత కార్యక్రమం నిర్వహించిన నవజీవన్ బాల భవన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

అపారిశుధ్యంతో అవస్థలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని సీతానగరంలో పేరుగాంచిన జీయర్ ఆశ్రమం, రామకృష్ణ మిషన్ స్కూల్, ఇంద్ర కిలాద్రి, శ్రీమద్ వీరాంజనేయ కోదండ రామాలయంతో పాటు కృష్ణానది అందాలను తిలకించడానికి అనేక మంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇటువంటి ప్రాంతంలో తాడేపల్లి పట్టణంలోని చెత్తనంతా తీసుకెళ్లి రైలు బ్రిడ్జి సమీపంలోని పుష్కర ఘాట్ల మెట్లకు పక్కనే పెద్ద ఎత్తున పోగు పెడుతున్నారు. కుళ్ళిన ఆహార పదార్థాలతో పాటు ప్లాస్టిక్ వ్యర్థలు పెద్ద ఎత్తు న ఇక్కడ డంపింగ్ చేస్తున్నారు. ఫలితంగా ఆ రోడ్డు మీదగా వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. భరించలేని దుర్గంధం వెదజల్లు తుందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ వ్యాధుల సమయం కావడంతో, వాతా వరణంలో మార్పులు రావటంతో అంటు రోగాలు ప్రబలుతాయేమోనని ఆందోళన వెలిబుచ్చుతున్నారు. తాడేపల్లి పట్టణంలో చెత్త తరలించటం వేరే ప్రాంతాల్లో డంపింగ్ యార్డ్ ఉన్నా కూడా నిత్యం వేలాదిమంది మహానాడు, సుందరయ్య నగర, కృష్ణా నది కట్ట పక్కన గల కృష్ణవేణి నగర్ నుండి విజయవాడకు నిత్యం ముఠా కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రజలకు ఇబ్బందిగా ఉంది పుష్కరఘట్ల మెట్ల మీద డంపింగ్ చేస్తున్నా చెత్తను వేరే చోటికి తరలించి, అక్కడ మరల చెత్త డంపింగ్ లేకుండా ఎంపీఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




ఇస్త్రీ బండిని అందజేస్తున్న కాట్రగడ్డ మధు టిడిపి నాయకులు

వృత్తిదారునికి ఇస్త్రీబండి అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం రాధా రంగా నగర్‌కు చెందిన రజక వృత్తిదారులు గుంపుల రంగమ్మకు వడ్డేశ్వరం సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన రావు తన సొంత నిధులతో, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో, ఇస్త్రీ బండిని బుధవారం టిడిపి నాయకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, చావలి సురేష్, షేక్ నాగూర్ వలి, కామినేని సాంబశివరావు షేక్ ఇమాంస, కామినేని మౌనిక, కంచర్ల కోటేశ్వరరావు, కాట్రగడ్డ లక్ష్మి కాట్రగడ్డ రాధా పాల్గొన్నారు.



క్రీడలు ఆరోగ్యానికి దోహదం

ప్రజాశక్తి-తాడేపల్లి

శరీరధారుఢ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని టిడిపి ప్రధాన కార్యాదర్శి కొల్లి శేషు తెలిపారు. బుధవారం పెనుమాక జిల్లా పరిషత్ హై స్కూల్లో 68 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్- అండర్17 బాల బాలికల ఉమ్మడి గుంటూరు జిల్లా త్రోబాల్ పోటీలు నిర్వహించారు. పోటీలు ప్రారంబి ంచిన కొన్ని శేషు మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులకు ఆటలు కూడా ముఖ్యమేనని చెప్పారు. క్రీడా కోటాలో విద్య, ఉద్యోగ అవకాశాలు మంత్రి నారా లోకేష్ రెండు శాతం నుండి మూడు శాతం కు పెంచినట్లు చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి, పాఠశాల మేనేజ్మెంట్ చైర్మన్ తెనాలి కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు వి పూర్ణ చంద్రరావు, పి ఈ టి మాస్టర్ రమేష్, స్థానికులు కల్లం శివ గోవిందరెడ్డి, పటాన్ జాని ఖాన్, వివిధ పాఠశాలల నుండి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


ఇప్పటంలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న రేవతి ఎంక్లేవ్ అధినేతలు

రేవతి ఎన్‌క్లేవ్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని, ఇప్పటం గ్రామంలో బుధవారం రేవతి ఎన్ క్లేవ్ బహుళ అంతస్తుల భవనానికి శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. అందరికీ అందుబాటులో ధరలలో రేవతి ఎన్ క్లేవ్ అపార్ట్మెంట్లు ఏపీ సి ఆర్ డి అప్రూవ్డ్ ప్లాన్‌తో ఆధునిక, వసతులు సౌకర్యాలతో ఈ బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నామని ఎన్ క్లేవ్ అధినేత, టిడిపి తెలుగు యువత అధ్యక్షులు పడవల మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా రేవతి ఎన్ క్లేవ్ బ్రోచర్‌ను టిడిపి నాయకులు ఆవిష్కరించారు. భూమి పూజ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, పద్మశాలి కార్పోరేషన్ అభివృద్ధి కమిటీ చైర్మన్ నందం అబద్దయ్య, టిడిపి గుంటూరు పార్లమెంట్ నియోజక వర్గ ఇన్చార్జి పోతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు కమిటీ సభ్యులు తమ్మిశెట్టి జానకి దేవి, టిడిపి రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్ చంద్, టిడిపి నాయకులు ఆవుల రవికిరణ్, మాదాల రమేష్ బాబు, తోట సాంబయ్య, భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని బహుళ అంతస్తుల భవన నిర్మాణం అభివృద్ధి చెందాలని పడవల మహేష్‌కు అభినందనలు తెలియజేశారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

జాతీయ 63వ ఫార్మసి వారోత్సవాల్లో భాగంగా తెనాలి ఎఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని తెనాలి తహశీల్దార్ కె వి గోపాలకృష్ణ ప్రారంభించారు. అనంతరం తాసిల్దార్ కూడా రక్తదానం చేశారు. ఇటీవల విజయవాడ వరద బాధితులకు సహాయం అందించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎఎస్ఎన్ కళాశాల యూత్ వాలంటీర్లకు ఎమ్మార్వో ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తెనాలి రెడ్ క్రాస్ చైర్మన్ ముమ్మనేని భానుమతి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె వెంకటరమణ, కళాశాల యూత్ రెడ్ క్రాస్ కన్వీనర్ డాక్టర్ లక్ష్మీ దుర్గ, రెడ్ క్రాస్ జిల్లా క్షేత్రస్థాయి అధికారి ఎస్ కె జాని రసూల్ తదితరులు పాల్గొన్నారు.


అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న ఎసిసి కార్మికులు

24వ రోజుకు సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

కోర్టుల తీర్పు ప్రకారం తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు దీక్ష శిబిరంలో బుధవారం అర్ధనగ్నంగా నిలబడి తమ నిరసన వ్యక్తం చేశారు. కార్మికులు చేస్తున్న దీక్షలు 24 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఇప్పటికైనా నిర్లక్ష్యం విడనాడి చర్చల ద్వారా సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. కార్మికులకు తాడేపల్లి లోని అన్ని ట్రేడ్ యూనియన్ సంఘాలు మద్దతిస్తున్న సంగతిని గుర్తు చేశారు. ఐఎఫ్‌టియు నాయకులు కే ఆదినారాయణ మాట్లాడుతూ ప్రస్తుత మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, యెహోషువ, విశాస్త్రి, ఎం గురవయ్య, భాష, మాణిక్యాలరావు, నాగేశ్వరరావు, సామ్రాజ్యం, బి అంకయ్య, సాంబయ్య, సుబ్బారావు, కృష్ణ, నవనీతం, సారమ్మ, రమాదేవి, ఇమాంబి పాల్గొన్నారు.

24న పేరేచర్లలో ఫుట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి - మేడికొండూరు

మండల స్థాయిలో అండర్ 14, 17 విభాగాల ఫుట్‌బాల్ టోర్నమెంట్ 2024 పేరేచర్ల ఎస్‌జివిఆర్ హైస్కూల్లో నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షులు యం శ్రీనివాసరావు, సెక్రెటరీ మానుకొండ బ్రహ్మజీ తెలిపారు. ఈ సందర్భంగా మేడికొండూరు ఫుట్‌బాల అసోసియేషన్ సెక్రెటరీ బ్రహ్మజీ మాట్లాడుతూ వచ్చే సంవత్సరం గుంటూరు జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్, గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించే జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోటీలలో మేడికొండూరు మండలం నుంచి ఎక్కువ మంది క్రీడాకారులను అందించడమే లక్ష్యంగా ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు, ఈ ఫుట్బాల్ టోర్నమెంట్ ప్రతి శని ఆదివారాల్లో, మండలంలోని వివిధ పాఠశాల మైదానంలో డిసెంబర్ 31 వరకు జరుగుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు 9347023690 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.


సుబ్బారావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఐనవోలు మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - తుళ్లూరు

ఐనవోలు మాజీ సర్పంచ్ పాలకాయల పాలకాయల సుబ్బారావు(91) అనారోగ్యంతో మృతి చెందారు. సిపిఎం తరపున సర్పంచిగా ఎన్నికైన ఈయన పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. సుబ్బారావుకు ఇరువురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. సుబ్బారావు సిపిఎం నాయకుడిగా, రైతు సంఘం నాయకుడిగా మంగళగిరి డివిజన్లో పనిచేశారు. సుబ్బారావు మృతి వార్త తెలిసిన వెంటనే సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, జెవి రాఘవులు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.ఎస్ చెంగయ్య, సిపిఎం నాయకులు ముసలి పకీరయ్య, ఎం భాగ్యరాజు, ఎస్ కె జానీ, వై కమలాకర రావు, బాలాజీ, టిడిపి నాయకులు పాలకాయల శివ నాగేశ్వరరావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు సువర్ణ కుమార్ సుబ్బారావు భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సుబ్బారావు అంత్యక్రియలు బుధవారం ఐనవోలు గ్రామంలో జరిగాయి.

గొర్లవారిపాలేన్ని సందర్శించిన డిపిఒ

ప్రజాశక్తి-గుంటూరు



కార్యదర్శి, ఇఒఆర్‌డితో మాట్లాడుతునన డిపిఒ

గుంటూరు రూరల్ మండలంలో కొన సాగుతున్న స్వర్ణ పంచాయతీ సర్వేను జిల్లా పంచాయతీ అధికారి బి.వి.నాగసాయి కుమార్ పరిశీలించారు. బుధవారం మండలంలోని గొర్లవారిపాలెం గ్రామాన్ని సందర్శించారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి స్వర్ణ గ్రామ పంచాయతీ పేరుతో నాలుగు అంశాలకు శ్రీకారం చుట్టిందన్నారు. గృహాలకు విద్యుత్ కలక్షన్లు, తాగునీటి కుళాయి, సిమెంటు రోడ్లు, మురుగు కాల్వలు, ఉపాధి పనులు ప్రభుత్వం దృష్టి సారించిందని, అందుకు సంబంధించిన సర్వే జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచా యతీ కార్యదర్శికి, అలాగే విస్తరణాధికారి కె.శ్రీనివాసరావుకు సర్వే గురించి పలు సూచనలు చేశారు.

16న విజ్ఞాన్స్‌లో ఇంటర్నేషనల్ వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో డిసెంబర్ 16 నుంచి 23 వరకు ఇంటర్నేషనల్ వర్క్‌షాప్ నిర్వహిస్తు న్నట్లు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. బుధవారం వర్సిటీలో వర్క్‌షాప్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ 'ఇన్నోవేషన్స్ ఇన్ మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్ అండ్ మోడెలింగ్' అనే అంశంపై హైబ్రిడ్ మోడ్‌లో ఇంటర్నేషనల్ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ నాటింగ్‌హమ్ డాక్టర్ వాసిర్ రహమాన్, యూఎస్‌ఏలోని యూనివర్సిటీ ఆఫ్ సౌత్‌ఫ్లోరిడా ప్రొఫెసర్ భువనేష్ యున్వేల్కర్, కొరియాలోని క్యుంగ్‌పోక్ నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రామ్మోహన్ మలిపెద్ది, లెబనాన్‌లోని లెబనీస్ అమెరికన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జుల్కర్‌నేన్ సబీర్, ఎన్‌ఐటీ దుర్గాపూర్ ప్రొఫెసర్ సమర్జిత్ కర్, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ సీఎస్ శాస్త్రి తదితరులు పాల్గొంటారన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డెంటల్ వైద్య నిపుణుల అసోసియేషన్ జాతీయ నాయకులు

నేటి నుండి మంగళగిరిలో డెంటల్ వైద్యుల జాతీయ సదస్సు

హాజరుకానున్న 2 వేల మందికిపైగా కట్టుడుపళ్ల చికిత్స వైద్య నిపుణులు

ప్రజాశక్తి మంగళగిరి

ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్లో కట్టుడు పళ్ళ చికిత్స ప్రత్యేక వైద్య నిపుణుల జాతీయ సదస్సు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రోస్టోడాంటిక్ సొసైటీ ఆధ్వర్యంలో 52వ జాతీయస్థాయి ఇండియన్ కట్టుడుపళ్ల ప్రత్యేక వైద్య నిపుణుల సంస్థ సదస్సు జరుగుతుందని కాన్ఫరెన్స్ చైర్మన్ డాక్టర్ టి కృష్ణమోహన్ తెలిపారు. ఈ మేరకు మంగళగిరి ప్రెస్ క్లబ్‌లో బుధవారం మీడియాతో మాట్లాడారు. ఈ సదస్సు భారతదేశంలోని ప్రోస్టోడాంటిక్ రంగానికి ఒక గొప్ప మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. సదస్సులో 2000 మందికి పైగా వైద్యులు పాల్గొంటారని తెలిపారు. దేశ విదేశాల నుండి వైద్య నిపుణులు పరిశోధకులు పాల్గొని వారి అనుభవాలను పంచుకొంటారని చెప్పారు. ఇండియన్ ప్రోస్టోడాంటిక్ సొసైటీ జాతీయ కార్యదర్శి డాక్టర్ జంగల హరి మాట్లాడుతూ కట్టుడు పళ్ళ చికిత్స రంగంలో తాజా ఆవిష్కరణలు ఆధునిక పరికరాలు చికిత్స విధానాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. కట్టుడు పళ్ళ వైద్యం అనేది వ్యక్తుల జీవితానికి గౌరవం నూతన ఉత్తేజం ఇస్తుందని తెలిపారు. ఇది కేవలం దంత సమస్యల పరిష్కారం మాత్రమే కాకుండా రోగుల ఆత్మవిశ్వాసాన్ని పెంచే వైద్య పద్ధతి అని అన్నారు. ఇండియన్ ప్రోస్టోడాంటిక్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ కార్యదర్శి డాక్టర్ భవన్ చంద్ మాట్లాడుతూ ప్రజలలో కట్టుడు పళ్ళ వైద్యంపై అవగాహన పెంపొందించడం, వైద్యరంగంలో తాజా పరిజ్ఞానం అందు బాటులోకి తీసుకురావడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. సదస్సులో నూతన విధానాలు పరికరాలు చికిత్స పద్ధతులపై ప్రదర్శనలు దేశ విదేశాలకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు, నిపుణుల ప్రసంగాలు, వైద్య విద్యార్థుల పరిశోధనాత్మక ప్రదర్శనలు, ఉంటాయని తెలిపారు. ఈ సదస్సుకు మాజీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మహేంద్ర నాథ్ రెడ్డి, జాతీయ అధ్యక్షులు డాక్టర్ మహేష్ లహోరి, ఇతర ప్రముఖ సీనియర్లు వస్తారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి శేషారెడ్డి, డాక్టర్ వై రవిశంకర్, డాక్టర్ జాకీర్ హుస్సేన్ షేక్, డాక్టర్ సిహెచ్ వివిఎన్ సాయికుమార్, డాక్టర్ చిరామాన సందీప్, డాక్టర్ సిహెచ్ చక్రవర్తి పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మితే

48 గంటల్లో రైతుల ఖాతాలకు నగదు జమ

ప్రజాశక్తి - కొల్లిపర, గుంటూరు

తూములూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్



మిల్లుకు పంపే ధాన్యాం ట్రాక్టర్‌ను రైతు బిడ్డతో రిబ్బన్ కట్ చేయిస్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

రాష్ట్ర ప్రభుత్వం రైతుకు మద్దతు ధర కల్పించడానికి రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ పేర్కొన్నారు. బుధవారం కొల్లిపర మండలం తూములురు గ్రామంలో రైతు సేవ కేంద్రం ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ, సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, అసిస్టెంట్ కలెక్టర్ పోవర్ స్వప్నిల్ జగన్నాథ్‌లతో కలసి ప్రారంభించారు. అనంతరం తూములూరులోని మారెడ్డి సుబ్బారెడ్డి ట్రస్ట్ కళ్యాణ మండపంలో ధాన్యం కొనుగోలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ మాట్లాడుతూ రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం జిల్లాలో తూములూరులో మొట్ట మొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. జిల్లాలో 156 రైతు సేవ కేంద్రాలను, 45 క్లస్టర్లగా చేయడం జరిగిందని, జిల్లాలో 3.4 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం వుందని తెలిపారు. ప్రభుత్వం రైతుకు 75 కే.జీల ఏ- గ్రేడ్ ధాన్యంకు రూ.1740 లు, సాధారణ రకానికి రూ.1725 లు మద్దతు ధర ఇస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చేటప్పుడు 17 శాతం తేమ వుండాలని, అదనంగా ఐదు శాతం వరకు శాతానికి కే.జి చొప్పున తీసుకోవడం జరుగుతుందన్నారు. అధిక తేమ వున్న ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన 48 గంటల్లో రైతుల ఖాతాలకు నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకుని నష్టపోవద్దన్నారు. ఈకేవైసి చేసుకున్న రైతుల వద్ద నుండి మాత్రమే ధాన్యాన్ని రైతు సేవ కేంద్రాలు కొనుగోలు చేస్తాయని తెలిపారు. జిల్లాలో 15 ధాన్యం మిల్లులు డబ్బులు కట్టి ఉన్నాయని, వాటిని పోర్టల్ లోకి తీసుకురావడం జరిగిందని ,రైతుకు ఇష్టమైన మిల్లుకు ధాన్యాన్ని తరలించ వచ్చని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలియజేశారు. మద్దతు ధర కంటే ఎవరు తక్కువ ధరకు అమ్మవద్దని ఈ-క్రాప్ చేసిన రైతు తమ ధాన్యాన్ని అమ్మేటప్పుడు ఒక రోజు ముందుగా రైతు సేవ కేంద్రంలో నమోదు చేసు కుంటే సిబ్బంది పంట దగ్గరకు వెళ్ళి తేమ శాతాన్ని పరిశీలించి ధాన్యం కొనుగోలు తేదీని నిర్ణయిస్తారన్నారు. తేమ శాతం 17 వుంటే వెంటనే కొనుగోలు చేస్తారని, అంతకంటే ఎక్కువ వుంటే రెండు రోజులు ఆరబెట్టి కొనుగోలు చేస్తారని తెలిపారు. ప్రైవేట్ వ్యక్తులు మద్ధతు ధరకంటే అధికంగా ఇస్తానంటే రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవచ్చని తెలిపారు. ఏమైనా సమస్యలు వుంటే టోల్ ఫ్రీ నెం.1967 , జిల్లా కంట్రోల్ రూమ్ నెం. 7702806804 కు తెలియజేయాలన్నారు. సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సేవ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి రైతుల ఆధార్ లింక్ తో వున్న బ్యాంక్ ఖాతాలకు నేరుగా నగదు చెల్లించడం జరుగుతుందన్నారు. గోదావరి జిల్లాల్లో నెల రోజుల ముందే ధాన్యం కొనుగోలు చేసి రూ.500 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. చిన్న , సన్నకారు రైతులను ఆదుకోవడానికి ఈ రైతు సేవ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ధాన్యం పొలం నుండి వాహనములో ఎగుమతి చేసిన దగ్గరి నుండి రైస్ మిల్లు వద్ద దిగుమతి అయ్యే వరకు జిపిఎస్ పరికరం ద్వారా ట్రాక్ చేయడం జరుగుతుందన్నారు. రైతు గోనె సంచులు కాని, హమాలీలు కాని మరియు రవాణా కాని ఏర్పాటు చేసుకుంటే, ప్రభుత్వం లెక్కల ప్రకారం ఆ పైకము నేరుగా రైతు ఖాతా లోకి ధాన్యం సొమ్ముతో సహా చెల్లించబడు తుందన్నారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు తూములురు నుండి ప్రారంభించు కోవడం జరుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమం ఎంతో విజయవంతం అవుతుందని ఆశిస్తున్నాయన్నారు. ధాన్యం విక్రయించే విషయంలో నిబంధనలను సులభతరం చేసిందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాన న్నారు. సమావేశం అనంతరం రైతు సేవ కేంద్రంలో అమ్మకానికి సిద్ధంగా వున్న ధాన్యం బస్తాల తూకాన్ని జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం ధాన్యాన్ని మిల్లులకు పంపడానికి ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌ను రైతు కుటుంబానికి చెందిన బాలుడి చేత రిబ్బన్ కత్తిరింప జేసి మిల్లులకు పంపించే కార్యక్రమా న్ని ప్రారంభించారు. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థచే రూపొందించిన రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ఖరీఫ్ సీజన్ 2024-25 కరపత్రాన్ని, పంటకు బీమా చేయండి రక్షణ కవచం పొందండి , పంటల బీమా పథకం రబీ 2024-25 ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పోస్టర్, కరపత్రాన్నిఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ లక్ష్మీ , జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి కోమలి పద్మ , జీడీసిఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ హరగోపాల్ , ఏడిఏ తెనాలి ఉషారాణి , దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ వంగా సాంబిరెడ్డి , తూములురు గ్రామ సర్పంచ్ అరుణా భాయ్ , యంపీపీ భీమవరపు పద్మావతి, టీడీపి మండల అధ్యక్షులు భీమవరపు చినకోటిరెడ్డి, జనసేన మండల అధ్యక్షులు యర్రు వెంకయ్యనాయుడు , స్థానిక నాయకులు , రైతులు పాల్గొన్నారు.

రైతు సంఘం హర్షం

ధాన్యం రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వము తూములూరులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మొలక శివ సాంబిరెడ్డి తెలియజేశారు. తూములూరు గ్రామంలోనే కాక అవసరమైన అన్నిచోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు. రైతు సంఘం తరపున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని మెమోరాండం ఇచ్చిన వెంటనే తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహ స్పందించి, కొల్లిపర మండలంలో ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేయడం పట్ల రైతు సంఘం తరపున ఆమెకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

ఏఇఎల్‌సి, ఆర్‌సియం ప్రతినిధులతో

శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణంపై కమిషనర్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు : శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్ఓబి) నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తామన్న ఏఈఎల్‌సి, ఆర్‌సిఎం సంస్థలకు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అభినందనలు తెలిపారు. బుధవారం కమిషనర్ చాంబర్‌లో ఆయా సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తొలుత ఆర్అండ్‌బి అధికారులు ఆర్ఓబి ప్లాన్‌ని, జిఎంసి పట్టణ ప్రణాళిక అధికారులు ప్రభావిత భవనాల వివరాలు, నష్టపరిహారం గురించి వివరించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి ఎదురు చూస్తున్న శంకర్ విలాస్ ఆర్ఓబికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలిపాయని, నిర్మాణం కోసం రోడ్ విస్తరణ 120 అడుగులకు చేపట్టనున్నామన్నారు. ఇప్పటికే అరండల్ పేట, బ్రాడిపేట వైపు ప్రభావిత భవనాల యజమానులతో సమావేశమయ్యామన్నారు. ఆర్ఓబి నిర్మాణంకు ఏఈఎల్‌సి, ఆర్‌సిఎం ప్రతినిధులు సహకరిస్తామని ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆయా సంస్థలకు చట్టపరంగా అందాల్సిన నష్ట పరిహారాలను త్వరితగతిన అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశం సిటీ ప్లానర్ రాంబాబు, ఏసిపి రెహ్మాన్, సిస్టర్ ఇన్నాసమ్మ, డాక్టర్ ఆని, (సెయింట్ జోసఫ్), డాక్టర్ కెఎంఎల్ శాస్త్రి, కె.మోసెస్ ఆర్నాల్డ్ (ఏఈఎల్సి), డాక్టర్ కనపాల జోసఫ్ (ఏసి కాలేజి), టి.రవిమోహన్ రెడ్డి (సెయింట్ జోసఫ్ హాస్పిటల్), టి.రితేష్ (జెఎంజె) తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌విఆర్‌లోఉచిత మెగా ఐ క్యాంప్

ప్రజాశక్తి-గుంటూరు



విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కంటి సంబంధిత సమస్యలను నివారించేందుకు మొబైల్ ఫోన్ వాడకాన్ని తగ్గించాలని ప్రముఖ కంటి శస్త్రనిపుణులు డాక్టర్ జి.రాజేష్ పేర్కొన్నారు. గుంటూరు నగరానికి చెందిన సుదర్శిని ఐ హాస్పిట ఆధ్వర్యంలో బుధ వారం ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో విద్యార్థులకు ఉచిత మెగా ఐ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యాధునిక ఐ చెకప్ పరికరాలతో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులకు మొబైల్ ద్వారా పిడిఎఫ్ రూపంలోని పాఠ్యాంశాలను చదవడం ద్వారా, మొబైల్ వాడం ద్వారా, ఎక్కువ సమయం కంప్యూటర్‌పై ద్రుష్టి కేంద్రీకరించడం ద్వారా కంటి సమస్యలు వస్తాయని, ఎక్కువ సమయం కంప్యూటర్ స్క్రీన్‌ని ఉపయోగించే విద్యార్థులు ప్రతి 20 నిమిషాలకు కంప్యూటర్ స్క్రీన్ నుండి దష్టిని మరల్చి సుమారు 20 అడుగుల దూరం వరకు కంటి చూపును 20 సెండ్ల వరకు కేంద్రీకతం చేయాలని, ఎక్కువగా ఆకు కూరలు, చేపలు, గుడ్లను వాడటం కంటికి బలమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.